


# దశమ గ్రహం

చంద్రం

రేడియోలో శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం శ్రావ్యంగా వినిపిస్తోంది.

ఆ రోజు శనివారం.

తల స్నానం, 'పూజ—ఉపవాసం— దేవాలయం పురాణ శ్రవణం. .బోలెడంత కార్యక్రమం. శనివారం చాలా పవిత్రమైన దినం కాంతమ్మకి. అయితే, ఇది ఒకప్పటి మాట. ఇటీవలి కాలంలో, కార్యక్రమమంతా యథావిధిగా నిర్వర్తిస్తున్నప్పటికీ ఏ పనిలోనూ మనస్సు లగ్నం కావటం లేదు. శనివారం పేరు తలుచుకుంటేనే మనశ్శాంతి కరువై పోయి, ఏవగింపు కలగసాగింది. శనివారం ఉదయం ప్రారంభమైన చిరాకు, సోమవారం ఏడెనిమిది గంటల పొద్దెక్కేంతవరకు తగ్గు ముఖం పట్టడం లేదు. తప్పు శనివారానిది కాదు. కాంతమ్మ శారీరక మానసిక ఆరోగ్యాల్లోనూ ఎలాంటి లోపమూ లేదు. అయితే, ఈ దారుణ సమస్యను పరిష్కరించ లేక ఈ మధ్య తరచు తీవ్రమైన మానసికాందోళనకు గురి కాసాగిందామె.

కాంతమ్మ వయస్సు యాభై దరిదాపుల్లో ఉంటుంది. ఆమెకు ఇద్దరు సంతానం. పెద్ద పిల్ల పేరు శారద. రెండవవాడు వాసు.

శారదకు పదిహేనో ఏడు వచ్చేటప్పటికే కాంతమ్మ భర్త రామారావు కాలం చేశాడు.

కాంతమ్మకు నడినెత్తిన పిడుగు పడ్డట్టయింది. అయినా, ఆమె చలించలేదు. అటు పుట్టింటివారి ఆర్థిక పరిస్థితి చూస్తే అంతంత మాత్రంగా ఉంది. ఇటు అత్తవారింటగూడా తనవా, పిల్లలనో ఆదుకొనే ఆధారం కనిపించలేదు. అందువల్ల ఒంటరిగా బ్రతకటానికే నిశ్చయించుకోవలసి వచ్చింది కాంతమ్మ.

రామారావు చేసింది గవర్నమెంటు ఉద్యోగం. ఆయన పోయిన తరవాత, అమాంబాపతు ఖర్చులు పోను, ఆమె చేతికి వచ్చిన రొక్కం పదివేల రూపాయలు వెంటనే శారద పేరున బాంకులో వేసేసింది.

నెలకు మూడు వందల వరకు అద్దెలు తెచ్చే విశాలమైన ఇల్లు ఉంది. ఓ బ్రతికి చెడ్డవాడు తెగ నమ్మేసుకొంటూంటే, చవగ్గా వచ్చింది గదా అని చొరవ చేసి కొనేశాడు రామారావు. అదిప్పుడిలా ఉపయోగపడుతోంది! ఆ ఇంటిలో ఒక్క

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
1980 నవలల పోటీ
పోటీ ముగింపు : 30 ఏప్రిల్ 80.
ఫలితాల ప్రకటన : 22 జూన్ 80.
మొదటి బహుమతి, రు. 4,000
రెండవ బహుమతి, రు. 3,000
మూడవ బహుమతి, రు. 2,000
వివరాలకు,
మేనేజర్,
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
చంద్రం బిల్డింగ్స్, విజయవాడ-520004

THE INSTITUTE OF ENGLISH STUDIES
ఆంగ్ల భాషాబోధక సంస్థ,
3, మొదటి మెయిన్ రోడ్డు, లేక్ ఏరియా,
నుంగంబాకం, మదరాసు-600 034
(వళ్లువరుకోటము ప్రక్కన)

WAVERING MIND IS SET STEADFAST BY THE MAGIC WAND OF EDUCATION

16 ఏండ్ల వయస్సునకు పైబడినవారు
అధికపక్షము ఒకే సంవత్సరములో అంగ్లములో
సంభాషించుటకును,
పరిచయము చేసికొనుటకును
తపాలా
ద్వారా
ప్రశాంత సమయములో
ప్రారంభమునుండి కాని -
లక్ష్యలక్షణ
పరిశోధన పద్ధతిలో కాని
ఇంగ్లీషు
నేర్చుకోవచ్చును.



మానస మర్కటమా! నీ ఆటలు నావద్ద సాగవు. ఇక నీ యిష్టానుసారము అడ అనుమతింపను. నా శాసనమునకే నీ వాడవలెను.
'ఆగ' మనిన ఆగవలెను. 'కదల' మనిన కదలవలెను.
నీచేత హారమాలయను పూలమాలనిచ్చెదను. రోయివలె దానిని నీవు నలుపలేవు. కళామతల్లి చరణముల కర్పించి, కరములు జోడించి, హృదయ పూర్వకముగా నమస్కరించవలెను.

చేరుటకై దరఖాస్తు చేయుటకు అవధి లేదు. పూర్తి వివరములకును వెంటనే శీఘ్రము వ్రాయుండి.

ప్రారంభించు క్రొత్త తరగతులగూర్చి నేరుగా వచ్చికాని, 25 పైసల తపాలాబిళ్లతో లేఖను వ్రాసికాని పూర్తి వివరములను తెలిసికొనండి. వెంటనే చేరండి.

G. SHANMUGASUNDARAM, Principal

పోర్షన్‌లో పిల్లలిద్దర్నీ పెట్టుకుని తనుంటూ మిగిలిన పోర్షన్ల మీద వస్తున్న అద్దె డబ్బులతో గుట్టుగా కాలం నెట్టుకు రాసాగింది కాంతమ్మ.

శారదకి పెళ్ళీడొచ్చింది. ఈడొచ్చిన ఆడపిల్లను ఓ అయ్య చేతిలో పెట్టడం తల్లిదండ్రుల ధర్మం. తండ్రి ఎలాగూ లేడు గనక, తల్లీ దండ్రీ తనే అయి, బంధు జనాల సహాయంతో, తగిన సంబంధం కోసం తీవ్ర ప్రయత్నం చేసింది కాంతమ్మ. ఆమె ప్రయత్నాల ఫలితంగా విజయవాడ సంబంధం అన్ని విధాలా అనుకూలంగా కనిపించింది.

కుర్రాడు బికామ్ చదువుకున్నాడు. బాంకులో ఉద్యోగం. తల్లిదండ్రులున్నారు. కుటుంబం పెద్దదీ, పైగా ఇతనే పెద్ద కొడుకు—అయినా, కుటుంబ భారం ఇతని మీద పడే ప్రమాదం అంతగా కనిపించదు. కారణం అతని తండ్రి కూడా అదే వూళ్ళో ఉద్యోగం చేసి సంపాదిస్తున్నాడు. ఆస్తిపాస్తులు లేకపోయినా కూటికీ, గుడ్డకూ లోటుండదన్న నమ్మకం కలిగి, ఆ సంబంధమే ఖాయం చేసింది కాంతమ్మ.

మొదట్లో వాళ్ళు పదివేలకు తగ్గేది లేదన్నారు కట్నం. అయితే, కాంతమ్మ దగ్గరున్నదే పదివేలు. ఈ పదివేలూ కట్నం కింద ఇచ్చేస్తే, ఖర్చుల కోసం ఎక్కడ్నుంచి తెస్తుంది డబ్బు? అథమపక్షం రెండు వేలన్నా చేతిలో ఉంచుకోవాలి. పెళ్ళిలో ఉండేవన్నీ కనిపించని ఖర్చులే కదా! అందుకనే, మధ్యవర్తుల ద్వారా మరీ మరీ అడిగించి, ఎనిమిదివేలకు బేరం ఖాయం చేయించింది.

ఫెళ్ళున పెళ్ళి జరిగిపోయింది.

కొండంత భారం దింపుకున్నట్లనిపించింది కాంతమ్మకి.

మగ దిక్కు లేకపోయినా, సలక్షణమైన సంబంధం చూసి, సకాలంలో ఆడపిల్ల పెళ్ళి జరిపించిందని బంధువులు, మిత్రులూ బహుధా ప్రశంసించారు కాంతమ్మను.

విజయవాడ సంబంధం ఖాయపర్చటంలో కాంతమ్మ మరో స్వార్థం కూడా చూసుకుంది. తనుంటున్నది గుడివాడలో. గుడివాడ నుండి విజయవాడ అంది పుచ్చుకున్నట్టుగా ఉంటుంది. బండెక్కితే గంట కూడా పట్టదు ప్రయాణం. చార్జి కూడా తక్కువే. కాబట్టి, తను విజయవాడ వెళ్ళాలన్నా, శారద గుడివాడ రావాలన్నా అంతగా ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండదు. బుద్ధి పుట్టినప్పుడల్లా వెళ్ళి పిల్లను చూసి రావచ్చు. ఆడపిల్ల తల్లిగా ఆ మాత్రం ఆశ పడటం తప్పు కాదేమో!

భర్త బ్రతికున్నంత కాలం పూజలూ వ్రతలూ అంటే అంతగా కిట్టేవి కావు కాంతమ్మకు. ఏదో చెయ్యక తప్పదన్నట్టు, నలుగురితోపాటు చేశాననిపిస్తుండేది. ఆయన పోయిన తరవాత మాత్రం తనే ప్రయత్న పూర్వకంగా దైవభక్తిపై మనస్సు లగ్నం చేసింది.

మగదిక్కు లేని ఆడదంటే అందరికీ అలుసే. ఇదొక సమస్య. రెండోది—కొంతకాలం సంసార సౌఖ్యం అనుభవించి, తనివితీరకముందే, ప్రౌఢ వయస్సులోనే, ఏకాంత వాసాని కలవాటు పడటం—ప్రకృతి ధర్మాన్ని ఎదిరించవలసిన కష్టసాధ్యమైన

పని ఇది! పాత. పిల్లల్ని పెంచి పెద్ద చెయ్యవలసిన గురుతరబాధ్యత మీదే! ఏటన్నింటినీ సక్రమంగా పరిష్కరించుకోవాలంటే మనస్సును జయించాలి. అంటే ఏదో ఒక వ్యాపకాన్ని కల్పించుకోవాలి. అన్నిటి కన్న భక్తిమార్గం ఉత్తమోత్తమంగా కనిపించింది కాంతమ్మకు. ఆ మార్గాన్నే అనుసరించిందామె. అదిగో—అప్పట్నుంచే శనివారాలు ఆమె జీవితంలో ప్రధాన పాత్ర వహించసాగినయ్.

ఇంట్లో పటానికి దణ్ణం పెట్టినా, గుడిలో విగ్రహానికి చేతులు మోడ్చినా, తన జీవితం ఏ ఒడిదుడుకులూ లేకుండా సాఫీగా గడిచిపోవాలనీ, తన పిల్లల భవిష్యత్తు బాగుండాలనీ కోరుకున్నదే తప్ప, మరో ఆలోచన ఆమె మనస్సులోకి వచ్చేది కాదు.

కాంతమ్మ అంటే నిప్పు — అనిపించుకుంది. ఆ విషయంలో అభిప్రాయభేదం లేదు.

శారదకు పెళ్ళి కావటంతో, తన తపస్సు చాలా వరకు ఫలించినట్టుగానే భావించి, తృప్తి పడింది కాంతమ్మ. కాని, ఆ తరవాత ఆమె తపస్సు ప్రశాంతంగా కొనసాగలేదు. శనివార కార్యక్రమాలకు తరచూ అంతరాయాలు కలగసాగినయ్.

మానసికంగా క్రుంగి పోసాగింది కాంతమ్మ.

పెళ్ళయితే బాగానే చేసింది కాని, తరవాత కార్యక్రమం మాత్రం ఆమె ఆశించినట్టుగా జరగలేదు.

తిరుగుళ్ళు, మరుగుళ్ళు, మనుగుడుపులు... అన్నీ పూర్తయిన తరవాత, ఓ మంచి ముహూర్తం చూసి కూతుర్ని అత్తవారింటికి పంపించింది కాంతమ్మ. అంతవరకు బాగానే జరిగింది. ఆటు తరవాత, తొలి పండగ ఉగాదికి కొడుకు వాసును పంపించి అల్లుణ్ణి, కూతుర్నీ పిలుపు చేసింది.

పండగ రెండు రోజులుందనగానే బయల్దేరి వచ్చారు—అల్లుడు రంగనాథం, కూతురు శారదాను.

సంతోషించింది కాంతమ్మ.

ఇద్దరికీ కొత్త బట్టలు పెట్టింది.

కొత్త పండగ సరదాగా గడిచిపోయింది.

పండగ వెళ్ళిన మరునాటి రోజే రంగనాథం ప్రయాణమయ్యాడు.

కాంతమ్మ నొచ్చుకుంది. "అదేమిటి బాబూ! అప్పుడే వెళ్ళిపోవటం? నాలుగు రోజులుండి వెళ్ళకూడదూ!" అంది బతిమాలాడుతున్నట్టు.

"మీ అమ్మాయి ఉంటుంది లెండి. నాకు శలవు లేదు. కనుక వెళ్ళక తప్పదు. మళ్ళీ రేపు శనివారం సాయంత్రం వస్తానులెండి" అన్నాడు రంగనాథం.


"అలాగే బాబూ!" అంది కాంతమ్మ.

ఆ రోజు బుధవారం. అన్నట్టుగానే శనివారం సాయంకాలానికల్లా మళ్ళీ వచ్చేశాడు రంగనాథం.

మాట నిలుపుకున్న అల్లుణ్ణి చూసి మురిసి పోయింది కాంతమ్మ.

శనివారం రాత్రి, ఆదివారం రోజంతా ఉండి, సోమవారం ఉదయాన్నే ప్రయాణమయ్యాడు రంగనాథం. ఈసారి కూడా శారదను బయల్దేర దియ్యలేదు.

పుట్టింటికి వచ్చిన మరునాటి రోజు నుంచే




భార్యల్ని తిరుగు ప్రయాణానికి తొందర పెట్టే అల్లుళ్ళతో పోల్చుకుని, తన అల్లుడి మంచితనానికి మహదానంద పడిపోయింది కాంతమ్మ. ఇరుగు పొరుగులతో ఈ విషయాన్ని గురించి గొప్పగా చెప్పుకుంది కూడాను.

మళ్ళీ శనివారం సాయంత్రం బండి దిగాడు రంగనాథం.

సోమవారం పొద్దున్నే బండెక్కాడు.

శనివారం రావటం, సోమవారం పోవటం పద్ధతి నాలుగైదు వారాలపాటు కొనసాగింది.

అప్పటికీ శారదను తీసుకువెళ్లే ప్రయత్నం చెయ్యలేదు రంగనాథం.

కాంతమ్మకు ఒక పక్క ఆనందంగా ఉన్నా, రెండో పక్క చిన్న అనుమానం తల ఎత్తసాగింది. కీడు శంకించక లేకపోయింది కాని, పరిస్థితి అర్థంకాక కొంచెం కలవర పడింది.

వారంలో అతను ఇక్కడ ఉండేవి రెండు రాత్రులు. ఒక పగలు. ఆదివారం మధ్యాహ్నం [illegible] సినిమాకు వెళుతున్నారు. మిగిలిన సమయం అంతా గది వదిలి బైటకి రావటం లేదు. ఒకటే నవ్వులు కేరింతలు తుళ్ళింతలు. చిలకా గోరింకల్లా ఎంతో అన్యోన్యంగా కనిపిస్తున్నారు.

ప్రయాణం గురించి చూచాయగా కూతుర్నే అడుగుదామనుకుంది ఒకటి రెండు సార్లు కాంతమ్మ. కాని, 'నే నిక్కడ ఉండటం నీకు కష్టంగా ఉందా అమ్మా?' అని శారద అడిగేసిందంటే, అప్పుడు నిజంగానే తను కష్ట పడాల్సి ఉంటుంది. అందుకనే ఆ ప్రయత్నం విరమించుకుంది.

రెండు మూడు నెలలు గడిచి పోయినయ్.

పరిస్థితిలో మార్పు లేదు.

కాంతమ్మ తనలో తనే మరిగి పోసాగింది.

నాలుగో నెలలో శారదను వెంట పెట్టుకుని విజయవాడ వెళ్ళాడు రంగనాథం.

అంతా అయోమయమై పోయింది కాంతమ్మకి.

తనకు తానుగా అల్లుణ్ణి అడగలేదు. కూతుర్నీ అడగలేదు. వాళ్ళు చెప్పలేదు.

శనివారం, సోమవారం రాకపోకల కార్యక్రమం మళ్ళీ మొదలయింది.

పెద్ద ఇరకాటంలో పడిపోయింది కాంతమ్మ.

'కూతుర్ని కాపరానికి పంపించి పట్టున్నావు. అయినా, ఎప్పుడు చూసినా ఇక్కడే ఉంటుందేం?' అంటూ అప్పుడే ఆరాలు తియ్యసాగారు తెలిసిన వాళ్ళు.

రంగనాథం రాకపోకల్ని ప్రత్యక్షంగా చూసిన దగ్గర వాళ్ళు 'ఇల్లరికం కాని ఉంచుకుంటున్నావా?' అనికూడా ప్రశ్నిస్తున్నారు.

సర్ది చెప్పలేక సతమతమై పోసాగింది కాంతమ్మ.

పెళ్ళయిన ఆడపిల్ల అత్తవారింట ఉండటమే అందం. చుట్టం చూపుగా వచ్చి చూసి వెళ్ళటం వేరు. నెల తరబడి పుట్టింట ఉండిపోవటం వేరు. లోకం ప్రత్యక్షంగానో పరోక్షంగానో అలాంటి ప్రశ్నలు అడుగుతారు. అయినా తనైనా ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న వాళ్ళను ఇలాగే ప్రశ్నిస్తుంది. తప్పదు.

నెలలు గడిచి పోతున్నాయ్.

చూస్తూండగానే సంవత్సరం తిరిగి పోయింది. ఈ సంవత్సర కాలంలోనూ మూడు - నాలుగు సార్లు చుట్టం చూపుగా విజయవాడ అత్తవారింటికి వెళ్ళి వచ్చింది శారద. మిగిలిన కాలమంతా ఇక్కడే ఉండి పోయింది.

శని, సోమవారాల ప్రయాణంతోపాటు, మధ్య మధ్య వచ్చే ఆఫీసు శలవు దినాలు, క్యాజువల్ లీవులూ గుడివాడలో అత్త వారింటనే గడిపేశాడు రంగనాథం.

మొదట్లో అల్లుడు కదా అని ప్రత్యేక మర్యాదలు చేస్తూ ఉండేది కాంతమ్మ రంగనాథం వచ్చినప్పుడల్లా, రాను రాను మర్యాదలు తగ్గిపోయి, విరాకులు, పరాకులు ప్రారంభమయ్యాయి. అయినా, అలాంటి వన్నీ పట్టించుకోలేదు పాపం రంగనాథం.

ఈ రోజు మరో విశేషం జరిగింది.

# అందంచిందే, శుభ్రమైన నల్లని జుట్టుకు అవసరం- కెఎమ్‌పి కొబ్బరినూనె ఇచ్చే సంరక్షణ.

కెఎమ్‌పి కొబ్బరినూనెలో ప్రకృతిలోగల విశిష్టత ఉంది. వెండిలా తెల్లని ప్రతి నూనె చుక్కాగూడా మీ జుట్టుని కుదుళ్ళనుంచి కొనలదాకా పెంపొందిస్తుంది. శీతాకాలంలో చుండ్రును దూరంచేసుంది; వేసవిలో, చర్మాన్నీ, జుట్టునూ ఎండనుంచీ, వేడినుంచీ కాపాడుతుంది. దాంతో యిక మీ జుట్టు శుభ్రంగా, తీరుగా, దువ్వుకోడానికి వీలుగా ఉంటుంది. రోజంతా.

"కెఎమ్‌పి. నేను అచ్చంగా సొంతంగా కోరుకునేది."
కె. ఆర్. విజయ




maa KMP 6 TEL A


శారదకు నెల తప్పింది.

సంతోషపడింది కాంతమ్మ. అయినా, అంత రాంతరాల్లో అసంతృప్తి నెలక వేస్తూనే ఉంది. ఆడపిల్ల అత్తవారింట ఉండి, నెల తప్పి వుట్టయితే సూడిదలు తీసుకు వెళ్ళటం, గాజులు పెట్టించడం సీమంతం చెయ్యటం, పురుడు పోసి పాపాయితో పంపటం. . . ఆ వేడుకే లేదు. తన కంత అదృష్టం ఎక్కడిది?

అయినా నిర్లక్ష్యం చెయ్యలేదు కాంతమ్మ. శారదకు నెల తప్పగానే లేడీ డాక్టరుతో పరీక్ష చేయించి, మందులు, టానిక్కులూ కొని వాడించింది. కూతురి మన సెరిగి వంటలు పిండివంటలు చేసి పెట్టింది. తను చెయ్య గలిగినంతా చేసి, కూతురికి ఏ లోటూ లేకుండ చూసింది.

నెలలు నిండిన తరవాత పండంటి మగ బిడ్డను కన్నది శారద.

అందరూ సంతోషించారు.

ఈ శుభ సందర్భంలో శారద అత్తగారూ, ఆడ బిడ్డా వచ్చి చూసి వెళ్ళారు.

రంగనాథం అటూ ఇటూ తిరుగుతూనే ఉన్నాడు.

పిల్లవాడికి మూడో నెల వచ్చింది.

భార్యనీ, కొడుకునీ విజయవాడ తీసుకు వెళ్ళి మూడు రోజుల తరవాత మళ్ళీ గుడివాడ తీసుకు వచ్చేశాడు రంగనాథం.

ఇదేం ఖర్మరా భగవంతుడా! అనుకుంది కాంతమ్మ.

పదవ తరగతి పాసయి, కాలేజీలో చేరిన నాను ఒక రోజున అడగనే అడిగేశాడు—"అమ్మా! అక్క ఇక్కడే ఉండిపోతుందా?" అని.

ఏం చెప్పాలో వెంటనే స్ఫురించక—"ఇక్కడే ఎందు కుంటుంది?" అని ఎదురు ప్రశ్న వేసింది కాంతమ్మ. తరవాత తమాయించుకొని "అత్తారింటికి వెళ్ళి పోతుంది" అని సమాధానం చెప్పింది.

"ఎప్పుడు?" వెంటనే అడిగాడు నాను.

ఎప్పుడని చెప్తుంది? తనకే తెలీదాయె! "ఎప్పుడో ఒకప్పుడు వెళ్తుంది. ఆ వివరాలన్నీ నీ కెందుకు?" అని గదుముకుంది. చిన్నవాళ్ళ ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పలేని సందర్భాలలో పెద్దవాళ్ళందరూ చేసే పనే అది!

కాంతమ్మ మనవడికి అయిదు నెలలు వెళ్ళినయ్.

ఏడు నెలలు వెళ్ళినయ్.

ఏడాది గడిచిపోయింది.

రంగనాథం ప్రయాణాలు నిర్విఘ్నంగా సాగు తున్నాయి. భార్యను తీసుకుని వెళ్ళే ఉద్దేశ్యం అతనిలో ఏకోశానా కనిపించటం లేదు.

లోకులు కాకుల్లా పొడుస్తున్నారు. వదంతులు కథల్నే సృష్టిస్తున్నాయి. ఇది ఒక బాధ.

ఖర్చులు విపరీతంగా పెరిగిపోయినయ్. ఇది మరో బాధ.

ఇంటద్దెలు తప్ప మరో ఆదాయం లేదు. తనూ, నానూ అయితే అంతగా ఇబ్బంది లేకపోను. తను ఇద్దరితోపాటు, శారద, ఆమె కొడుకు, వారానికి రెండు రోజులు రంగనాథం ... ఎలా గడుస్తుంది? కాలేజీలో చేరటం వల్ల నాను ఖర్చులు కూడా పెరిగి నయ్. ఫీజులు, పుస్తకాలు, బట్టలు ... పైగా ట్యూషన్ పెట్టించా లంటున్నాడు! ఇవన్నీ ఎలా

వెనక్కు రావటం?

అప్పులపాలు కాకముందే, అవకాశం చూసి అల్లుడితో ఈ విషయం మాట్లాడదామనే తీర్మానించుకుంది కాంతమ్మ. అయితే, ఆమె కా అవకాశం చిక్కలేదు. ఆమె కన్నా ముందు రంగనాథమే ఆ అవకాశం వినియోగించుకున్నాడు.

ఒక రోజు శారద సమక్షంలోనే—"మీ అమ్మాయిని ఇక్కడ ఉంచినందువల్ల మీకేమన్నా ఇబ్బందిగా ఉందాండీ?" అని ప్రశ్నించాడు అత్తగార్ని రంగనాథం— శాక్యంగా.

ఏమని చెప్తుంది కాంతమ్మ. ఇబ్బందిగా ఉందని చెప్తుందా? లేదని చెప్తుందా? నెమ్మదిగా తలెత్తి కూతురి ముఖంలోకి చూసింది. తను చెప్పబోయే సమాధానం కోసం కుతూహలంగా చూస్తున్నట్టుంది ఆమె ముఖం.

అల్లుడివైపు చూడలేకపోయింది కాంతమ్మ. దిగాలుగా తల వాల్చుకుంది.

రంగనాథం ప్రారంభించాడు — "విజయవాడలో మా ఇల్లు చాలా చిన్నదండి. కుటుంబం పెద్దది. ఆ ఉమ్మడి కుటుంబంలో మా సరదాల మాట అటుంచి, కనీసం సంసారం సాఫీగా సాగుతుందన్న నమ్మకం కూడా నాకు లేదు."

తరువాత శారద అందుకుంది—"అవునమ్మా! ఆ ఇంటిలో కూచోటానికి చోటుండదు. పడుకోవటానికి సరిగుండదు. పగలు బజారులా ఉంటుంది. అర్ధరాత్రి వరకు సద్దు మణగదు. అక్కడ కాపురం చెయ్యాలంటే సిగ్గు విడిచేయ్యాలి!"

మళ్ళీ రంగనాథం అందుకున్నాడు: "అందుకనే మీ అమ్మాయిని ఇంతకాలం ఇక్కడే ఉంచేశాను."

"ఆ ఇంటికి వెళ్ళాలంటేనే భయంగా ఉంటుంది నాకు!" — శారద.

"నాకూ అంతే!" — రంగనాథం.

వేరే ఇల్లు తీసుకొని ఉండవచ్చునన్న ఆలోచన వీళ్ళ కెందుకు రా దసలు?— అని ఆశ్చర్యపోయింది కాంతమ్మ.

అదీ చెప్పుకొచ్చాడు రంగనాథం.—"విడిగా ఒక చిన్న పోర్షన్ తీసుకొని ఉంటే బావుంటుందని మొదట్లో అనుకున్నాను కాని, వాళ్ళంతాఅక్కడ ఉండగావేరింటి కాపురం అంత సబబుగా ఉండదని ఆ ప్రయత్నం విరమించుకున్నాను. అదీగాక విజయవాడలో ఇంటి అద్దెలు దారుణంగా ఉంటాయి — బోలెడు డబ్బు పొయ్యాలి!"

"ఇక్కడ మీ పోషణ భారం నా కొక సమస్య కాలేదా మరి?" అని కాంతమ్మ అడక్క పోయినా, ఆ విషయం గురించి మాట్లాడాడు రంగనాథం. "శారద మీ అమ్మాయే అయినా,ఎంతకాలమని మీరు పోషించ గలరు? ఒక వేళ మీరు పోషించ గలిగినా, ఎక్కువ కాలం ఆమెను మీ మీద వదిలెయ్యటం నాకూ భావ్యంగా ఉండదు. అందుకని నేనో పరిష్కారమార్గం ఆలోచించాను. ఆమె ఖర్చుల క్రింద నెల నెల ఇంత అని ఇస్తాను — మీరు అన్యథా భావించనంటేనే!

ఎంత విచిత్రం! — ఆశ్చర్య పోయింది కాంతమ్మ. శారదను ఇంకా ఇక్కడే ఉంచెయ్యాలని అతని ప్రయత్నం. నెలనెలా ఇంత ఇక్కడ ఇచ్చే బదులు అక్కడే ఇచ్చి ఇల్లు తీసుకో వచ్చుగా. వేరింటి కాపురం పెట్టటం ఇష్టంలేకపోతే ఉమ్మడిగానే ఒక పెద్ద ఇల్లు తీసుకుని సర్దుకోవచ్చుగదా!

పూటకూళ్ళమ్మకు ఇచ్చినట్టు నెల, కింతని ఇస్తాడట. ఇవ్వటానికి అతనికి 'ఇది' లేకపోయినా తీసుకుపోవటానికి తన కైనా ఉండద్దూ? అదీకాక శారద ఇక్కడ ఉండి పోవటం వల్ల తన కెదురైన సమస్య పోషణ భారం పెరగటం ఒకటే కాదు కదా. అభిమానం విడిచి అత నిచ్చే డబ్బు తీసుకోవటానికి తను సిద్ధ పడినా, సమస్య అంతటితో తీరిపోదే.

ఆర్థిక సమస్య తీరుతుంది. నిజమే.

మరి లోకాపవాదు సంగతి?

శారద అత్తవారింటికి వెళ్ళటమే ఈ సమస్య లన్నింటికీ మేలైన పరిష్కారం. ఆ గ్రహింపు వాళ్ళిద్దరికీ ఉన్నట్టు లేదు.

సాధారణంగా ఒకంతట, ముఖాముఖీ మాట్లాడుకోరు అత్తా, అల్లుడూ. ఎప్పుడైనా ఒకరితో ఒకరు ఏదైనా చెప్పవలసి వచ్చినప్పుడు శారద ద్వారా చెప్పిస్తుంటారు. ఇప్పటి సమస్య అతి ముఖ్యమైంది కనక, మాట్లాడుకోక తప్పలేదు. అయినా ఫలితం లేకపోయింది.

అల్లుడు చేసిన ప్రతిపాదనకు 'అవును కాదు' అని ఏమీ అనలేక పోయింది కాంతమ్మ.

రంగనాథమూ రెట్టించ లేదు.

శారదా మాట్లాడలేదు.

సమస్య పరిష్కృతం కాకుండానే సమావేశం ముగిసి పోయింది.

రంగనాథం పద్ధతిలో మార్పు రాలేదు.

కాంతమ్మ కేమీ పాలు పోవటం లేదు. శనివారం పేరు వింటేనే పులికిలికి పడసాగిం దామె. శనివారం వచ్చిందంటే అల్లు డొచ్చినట్టే లెక్క. అల్లుడి పట్ల ఆదరణ భావం ఏ నాడో అణగారి పోయింది. ఇప్పు డున్నది విసుగు, అసహ్యం.

అల్లుణ్ణి దశమ గ్రహమని వ్యవహరించటం ఎంతో సముచితంగా కనిపించిం దామెకు. బహుశా ఇలాంటి అల్లుళ్ళు ఉండబట్టే ఆ మాట వాడుకలోకి వచ్చి ఉంటుందనికూడా ఆమె అభిప్రాయ పడింది.

అల్లుడి పుణ్యమా అని ఆమె శనివారం కార్యక్రమాలు దెబ్బ తిని పోతున్నాయి. చిరాకులు పరాకులు ఎక్కువై పోయినయ్. ఏ పని లోనూ మనస్సు లగ్నం కావటం లేదు. మనస్సు మనస్సులో ఉంటేనే కదా అసలు. ఆమెకు అత్యంత ప్రీతిపాత్రమైన వెంకటేశ్వర సుప్రభాతంకూడా ఈ మధ్య నిశ్చలంగా వినలేక పోతూంది.

అప్పట్టు రేడియోలో వస్తున్న వెంకటేశ్వర సుప్రభాతం ఎప్పుడో పూర్తయింది. పరధ్యానంలో పడి ఆ విషయమే గుర్తించ లేదు కాంతమ్మ.

ఆ రోజు శనివారం అన్న సంగతి గుర్తుంది కాని, తల స్నానం చెయ్యలేదు కాంతమ్మ. పూజ సంగతి ఎత్తలేదు. శారీరకమైన రుగ్మతలు లేక పోయినా, మానసికంగా అలిసి పోయిం దామె. వరండాలో మంచం మీద బద్ధకంగా నడుం వాల్చి కళ్ళు మూసుకుంది.

దక్షిణం వైపు దించిన పంచలో శారద వంట ప్రయత్నాల్లో ఉంది.

రేడియోలో జనరంజని పాటలు వినిపిస్తున్నాయి. సమయం తొమ్మిది గంటలు కావస్తోంది.

"ఏమండీ!" అన్న పిలుపువినబడి, కళ్ళు తెరిచింది.


స్వయం ఉపాధి పథకము

ఫోటోగ్రఫీ మరియు స్క్రీన్ ప్రింటింగ్‌ను పోస్టల్‌ట్యూషన్ ద్వారా హిందీ, ఇంగ్లీషు లేక తమిళములో నేర్చుకుని స్వతంత్రముగా సంపాదించుకొన నారంభించండి. వివరములకు:

**KALAIMATHI NILAYAM (A)**
**Nanjaithalaiyur-639204**
**Tamil Nadu**

మీకు బేబీ/బాబు కావాలా?



ఆపరేషన్, ఇతర వైద్య చికిత్సలచే నిరాశ చెందిన సోదరీమణులు అనేకులు మా సలహాలచే సంతానవతులయి ఇచ్చిన యోగ్యతాపత్రములు కలవు. స్త్రీ పురుష వంధ్యాదోషనివారణ నిపుణులు. ఉచిత వివరములకు

శ్రీనాగార్జున మూలికకుటీరం
రైల్వేస్టేషన్‌వద్ద, రామాలయం వీధి,
తెనాలి - 2.



పాతిక ముప్పై సంవత్సరాల మధ్య వయస్సు గల ఒక స్త్రీ ఇంటి ముందు నిలబడి ఉంది.

"ఏం కావాలమ్మా?" అడిగింది కాంతమ్మ.

"ఇళ్ళేమైనా ఖాళీగా ఉన్నాయండి అద్దెకి."

"లేవమ్మా." అనేసి మళ్ళీ కళ్ళు మూసుకుంది కాంతమ్మ.

ఆ స్త్రీ నిరాశగా వెను దిరిగింది.

ఇంతట్లోకి ఒక బ్రహ్మాండమైన ఆలోచన బుర్రలో తళుక్కున మెరిసి, గబుక్కున లేచి కూచుని "ఇలా రావమ్మా" అని ఆ స్త్రీని పిలిచింది కాంతమ్మ.

ఆశగా తిరిగి వచ్చింది ఆ అమ్మాయి.

"ఎంత పోర్షన్ కావాలి?"

"నేనొక్కదాన్నే ఉంటానండి. రెండుగదులుంటే చాలు. సౌకర్యంగా ఉంటే ఒక్క గదైనా సర్దు కుంటాను."

"ఈ వూరేనా మీది?"

"కాదండి. ఈ పక్క వీధిలో ఉన్న ఎలిమెంటరీ స్కూల్లో టీచరుగా పని చేస్తున్నాను. ఈ మధ్యనే బదిలీ మీద వచ్చాను. స్కూలుకు కాస్త దగ్గరగా ఉంటే బాగుంటుందని చూస్తున్నాను" తన పరిస్థితి వివరించింది ఆ అమ్మాయి.

"మా ఇంట్లో ఆ వెనక గది ఒక్కటే ఖాళీగా ఉంది. ఈ రెండు గదులకీ మధ్యనున్న తలుపు మూసేస్తాం. రాకపోకలు వెనక నుంచి చెయ్యాలి. నీటికి, దొడ్డికి బైటికి పోనక్కరలేదు. అన్ని సౌకర్యాలు ఉన్నాయి. వంటకు మాత్రం ప్రత్యేకించి ఏమీ లేదు. గదిలోనే స్టౌ మీద చేసుకోవచ్చు. మీది స్టౌ వంటేగా?"

"అవునండి ఓసారి చూపిస్తారా?"

"అలాగే..."

లోపలకు తీసుకెళ్ళి చూపించింది కాంతమ్మ. అంతా చూసుకొని పర్వాలేదనుకున్న తర్వాత, "అద్దె ఎంతండి?" అనడిగింది ఆ అమ్మాయి.

"ముప్పై" అంది కాంతమ్మ.

"ఒక్క గదే కదా—ఇరవై తీసుకోండి" అంది ఆ అమ్మాయి.

కాస్సేపు బేరం సాగిన తరవాత, పాతిక్కి ఖాయ పరుచుకుని—"ఎప్పుడు రమ్మంటారు?" అంది ఆ అమ్మాయి.

"నీ ఇష్టం."

"ఈ పూటే వచ్చేస్తాను—తిథి బావుంది. సామాన్లవీ తీయించేసి, కాస్త గది కడిగించేస్తారా?"

"అలాగే."

ఆ అమ్మాయి సంతోషంగా వెళ్ళిపోయింది.

ఇంతసేపూ ఆశ్చర్యంగా చూస్తూ వూరుకున్న శారద—"ఇదేమిటమ్మా?" అంది ఏమీ అర్థంకాక.

"ఈ గది అద్దెకిచ్చేస్తున్నానమ్మా!"

"ఇది అద్దెకిచ్చేస్తే ఎలా? మిగిలేది ఒక్కగదేగా!"

"ఒక్క గదేమిటి?—ఒకగది, వరండా, వంట ఎలాగూ ఆ పంచలో చేసుకుంటున్నాం కదా!"

"అయినా చా[illegible]!"

"చాలటాని కంతెక్కడుందమ్మా? సరిపెట్టు కోవాలి గాని. పాతిక రూపాయలు అద్దె! ఏ ఖర్చుకైనా పనికి వస్తాయి."

ఇంకేం మాట్లాడుతుంది శారద.

పన్నెండు గంటలలోపే ఆ అమ్మాయి వచ్చి గదిలో ప్రవేశించింది. రెండు గదులకూ మధ్యనున్న తలుపు శాశ్వతంగా మూసివేయబడింది.

సాయంత్రం బండిలో రంగనాథం దిగాడు. మధ్య తలుపు మూసి ఉండడంచూసి ఆశ్చర్యంగా భార్య నడిగాడు—"ఇదేమిటి?" అని.

విషయం వివరించింది శారద.

భోజనాలు ముగిసినాయి.

పడకల సమయం ఆసన్నమయింది.

శీతాకాలం కనుక చలి విపరీతంగా ఉంది.

గదిలో ఒక వారగా కాంతమ్మ చాప పరుచు కుంది. ఆ పక్కనే మడత మంచం మీద వాను, దాని కానించి రంగనాథం పడక, తరవాత శారద.

తెల్లవార్లూ కంటి మీద కునుకు పట్టలేదు రంగనాథానికి. అసహనంగా అటు పొర్లీ, ఇటు పొర్లీ, బాగా ఆలోచించి, తెల్లవారే సరికి ఓ నిర యానికి వచ్చేశాడు.

ఆ రాత్రి శారదకూ సరిగా నిద్ర పట్టలేదు.

వారంరోజుల వియోగం తరవాత—చలికాలం—రాత్రి—ఒకేగదిలో—రెండు మంచాల మీద—విడివిడిగా పడుకుని—ఒకర్నొకరు చూసుకుంటూ—విరహ మనుభవించడం. .దుర్భరమే మరి!

పొద్దున్నే పక్క దిగంగానే భార్యను పక్కకు పిలిచి, ప్రయాణానికి ఏర్పాట్లు చెయ్యమన్నాడు రంగనాథం.

ముఖాముఖి మాట్లాడుకోకపోయినా అత్త ఆలోచన అల్లుడికీ, అల్లుడి ఆరాటం అత్తకీ అవగతమై పోయింది.

పది గంటల బండికే ప్రయాణమయ్యారు వాళ్ళు.

ఆనందంగా సాగనంపింది కాంతమ్మ.

వారం తిరక్క ముందే ఆర్డిల్లు సంపాదించి, వేరింట కాపురం పెట్టి, అడ్రసుతోసహా అత్తగారికి ఉత్తరం రాశాడు రంగనాథం.

కూతురి కాపురాన్ని చూసి రావటానికి సంతోషంగా బయలు దేరింది కాంతమ్మ. *

# కొత్త కబుర్లు

## త్రిపిరి ఇసుమున...

ప్రయత్నించి ఇసుక నుంచి తైలాన్ని తీయవచ్చు. ఇస్తకను పిండి ఎవ్వరూ ఏమీ తీయలేదు గాని ఇసుకను తవ్వి మానెను (పెట్రోల్యం) మాత్రం తీశారు, కాని నీటిని మాత్రం తీయలేక పోయారు.

ప్రయత్నిస్తే అసాధ్యమైనది ఏదీ లేదని తలచి, పూర్వీకులు తమ బుద్ధి బలంతో ఇసుక తప్పితే మరేదీ దొరకని ప్రదేశాల్లో కూడా నీటిని తెప్పించగలిగారు.

మరి నీళ్ళు దొరికితే అవి ఎడారులలాగా ఉండవు గదా అని ప్రశ్నించవచ్చు. సస్యశ్యామలం చేసేటంతటి పరిమాణంతో నీళ్ళు దొరకక పోవచ్చుగాని ప్రాణాలు నిలబెట్టేటంత మాత్రం తేవచ్చునంటారు.

ఇసుక ప్రదేశాల్లో ముఖ్యంగా ఎడారుల్లో గూడా నీళ్ళు తెప్పించవచ్చుననే ఆలోచనకు ఒక ఆధారం గూడా ఉంది.

ఎంతటి ఎడారుల్లో అయినా కొంత జీవ జాలాన్ని చూడవచ్చు. ఏ జీవికైనా బ్రతకటానికి నీళ్ళు కావాలి గదా. ఆ ప్రదేశాల్లో జీవులు కొన్ని బ్రతుకుతున్నాయంటే ఎంతోకొంత నీళ్ళు ఎలాగో ఒకలాగ దొరుకుతున్నా యనే కదా అర్థం.

క్రిమియాలో జరిగిన త్రవ్వకాల్లో రాతి పిరమిడులలాటివి కొన్ని బయట పడ్డాయి. ఆ పిరమిడుల లోపల చాలా రంధ్రాలు, గొట్టాలు, కాలువలు పాత్రలు కనిపించాయి. అవన్నీ ఎందుకున్నాయి. దేనికి ఉపయోగపడతాయి అనేది చాలాకాలంగా తేలలేదు. ఆ తరవాత ఆలోచిస్తే తేలిందేమిటంటే అవన్నీ ఎడారి ప్రదేశంలో నీటిని పోగు చేయటానికి వాడేవని—ఇది ఎలా సాధ్యం?

పిరమిడుల లోపలకు వచ్చే వేడిగాలి (నీటి ఆవిరితో కూడుకున్న సముద్రపు గాలి ) లోపలి చల్లని గోడలకు తగిలి క్రమంగా ఘనీభవిస్తుంది. సోడిగ్లాసు లోపల మంచు కొద్దిగా వేస్తే గ్లాసు చుట్టూ బయటవైపు నీటి బిందువులు ఎలా ఏర్పడతాయో ఇక్కడ పిరమిడుల లోపలా అంతే.

ఆ విధంగా ఏర్పడే నీటి బిందువులు అన్నీ కలిస్తే మరి నీళ్లేగా. అవి లోపల రిజర్వాయరులలో చేరుకుంటాయి.

ఈ తతంగమంతా గాలిలోని తేమ వల్లనే సాధ్యమవుతుంది. నీళ్ళు ఏ మాత్రం దొరకని చోట, ప్రకృతిని అర్థం చేసుకుని తక్కువ శ్రమతో తమ తెలివి నుపయోగించి నీటిని పొందే ఈ ప్రయత్నం బాగా లేదూ!

—కొత్త శేషాద్రి శేఖరం